సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 10 । జనవరి । 2023



పక్కా ఏర్పాట్లతో రథసప్తమి

రథ సప్తమికి పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి ధర్మాన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

- 8లో



ఎచ్చెర్లలో అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా జరిగింది. 208 మందిని ఎంపిక చేశారు.

- 8లో

నేడు డయల్ యువర్ జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి మంగళవారం డయల్ యువర్ జేసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి పది గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, రైతులు 78933 00311 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యలు చెప్పుకోవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

12 మందికి కారుణ్య నియామక పత్రాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన 12 మంది ఉద్యోగుల కుటుంబాల్లోని కొందరికి జిల్లాలోని సచివాలయాల్లో ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ మేరకు సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వారికి నియామక పత్రాలు అందజేశారు. విధులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం ఎ.విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి, తదితరులు పాల్గొన్నారు.

'వాసుదేవుని దర్శనంతో జన్మ చరితార్థం'

మందస: శ్రీవాసుదేవ పెరుమాళ్‌స్వామి దర్శనంతో జన్మ చరితార్థమవుతుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రధాన శిష్యులు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. మందస పట్టణంలో వాసుదేవుని సోమవారం ఉదయం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, ఆండాళ్ గోష్టి, ఆలయ కమిటీతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడి విగ్రహం అపురూపమైన దని తెలిపారు. చిన్నజీయర్‌స్వామి గురువు రామానుజాచార్యులు ఇక్కడే విద్యాభ్యాసం చేయడంతో వాసుదేవుని ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఫిబ్రవరిలోనూ ఉత్సవాలు జరుగుతాయన్నారు. శంషాబాద్‌లో ఫిబ్రవరి రెండు నుంచి 11 వరకు సమతాకుంభ్ అనే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఎక్కువ కేసులు రాజీ చేయాలి'



వీసీలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ ఫిబ్రవరి 11న నిర్వహించనున్నామని, అందులో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. ఆయన సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని న్యాయాధికారులందరితో మాట్లాడారు. రాజీ పడదగ్గ కేసులకు లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం చూపించాలని సూచించారు. వీసీలో శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, సీనియర్ సివిల్ జడ్జిలు నాగమణి, అనురాధ టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి హరిత, రాజాం సీనియర్ సివిల్ జడ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీతో ముగ్గురు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ

టెక్కలి: అక్రమంగా నాటు తుపాకీ కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను టెక్కలి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిది మెళియాపుట్టి మండలం కాగా.. మరో వ్యక్తి జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిల్లారి యుగంధర్ కావడం గమనార్హం. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి నుంచి మెళియాపుట్టి మధ్యలో గూడేం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అదే మార్గంలో మెళియాపుట్టి మండలం నందువ గ్రామానికి చెందిన సవర ప్రసాద్, సవర గజపతిలు బైక్‌పై వచ్చారు. వీరిపై అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేయగా నాటు తుపాకీ కనిపించింది. దీంతో పోలీసులు షాకయ్యారు. పూర్తిస్థాయిలో తనిఖీ చేయగా నాటు తుపాకీతో పాటు తుపాకీని పోలిన మరో కర్ర అచ్చు, 12 ఎంఎం సామర్థ్యం కలిగిన 96 తూటాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా జలుమూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిల్లారి యుగంధర్‌కు చెందిన నాటు తుపాకీ అని వారు చెప్పారు. దీంతో టెక్కలి పోలీసులు ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాటుతుపాకీతో సంబంధం ఉన్న హెచ్‌సీది టెక్కలి మండలంలోని ఓ గ్రామమని సమాచారం. ఈ ఆయుధాన్ని ఎందుకు సిద్ధం చేసుకున్నారో తెలియాల్సి ఉంది.



కన్నీటి ఉద్దానంపై పన్నీటి జల్లు

- కిడ్నీ వ్యాధి బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- శరవేగంగా కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం
- త్వరలోనే పూర్తి కానున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు

సాక్షి ఫోకస్

పచ్చటి ఉద్దానం కంట వెచ్చగా జారిన కన్నీటి బొట్లు ఏ నాయకుడి కంటా పడలేదు. ఏళ్లుగా ఇక్కడి బీల నేలలో తెగిపడిన తాళిబొట్లు ఏ నేతనూ కదిలించలేదు. ఐదో తనం కోల్పోయిన తల్లులు, అమ్మనాన్నలకు దూరమైన పిల్లలు, మనుషులు లేక వారి జ్ఞాపకాలుగా మిగిలిన ఇళ్లు.. ఏపీ ప్రజా ప్రతినిధుల కరకు గుండెలను కరిగించలేదు. హామీలిచ్చిన వారు కొందరు, అన్నీ చేసేశామని ప్రచారం చేసుకున్న వారు ఇంకొందరు. అలాంటి ఆపత్కాలంలో వచ్చాడొక నాయకుడు. వైద్యం కోసం విశాఖ వెళ్లే రోగుల చెంతకు దయాలసిస్ యూనిట్లు రప్పించాడు. డబ్బుల్లేక అల్లాడుతున్న అభాగ్యులకు చేతిలో నెలకు రూ.10 వేలు పెడుతున్నాడు. ఎక్కడో ఉన్న వంశధారను ఉద్దానంకు తీసుకువస్తున్నాడు. అతడే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి, ఉద్దానం ప్రాజెక్టు ఆయన చిత్తశుద్ధికి సజీవ సాక్ష్యాలు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉద్దానం ఊపిరి పీల్చుకుంటోంది. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండడంతో మృత్యుకౌగిట నుంచి విడుదలవుతోంది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఒకవైపు వ్యాధి మూలాలు కనుగొనేందుకు కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని నిర్మిస్తోంది. మరోవైపు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యంతో పాటు డయాలసిస్, ఉచిత మందులను పూర్తిస్థాయిలో అందిస్తోంది. ఇంకోవైపు వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణం తాగునీరై ఉండొచ్చన్న నిపుణుల సూచనల మేరకు రూ.700 కోట్లతో భారీ మంచినీటి పథకాన్ని నిర్మిస్తోంది. ఇవి త్వరలోనే పూర్తి కానున్నాయి.

పాదయాత్రలో చూసి..

పాదయాత్రలో కిడ్నీ వ్యాధి బాధితుల బాధలను వైఎస్ జగన్ దగ్గరుండి చూశారు. ప్రతిపక్ష నేత హోదాలో కవిటి మండలం జగతిలో కిడ్నీ బాధితుల భరోసా యాత్ర పేరిట పర్యటించారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడి.. తన కార్యాచరణను అప్పుడే స్పష్టంగా ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, పింఛన్ల పెంపు, ఉపరితల తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

బాబుదంతా బడాయే..

అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, ఆయన భాగస్వామి పవన్ కల్యాణ్ ఉద్దానం కిడ్నీ బాధితులను పట్టించుకున్న పాపాన పోలేదు. తిత్లీ సమయంలో గోడు చెప్పుకుందామని వెళ్లిన వారిపై చంద్రబాబు మండిపడ్డారు కూడా. 2019 ఎన్నికల ప్రచారానికి సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు ఒక్క కిడ్నీ వ్యాధి బాధితుడికి కూడా భరోసా ఇవ్వలేకపోయారు. మరోవైపు పవన్ కల్యాణ్ పెద్ద ఎత్తున ఉద్దానం సమస్య పరిష్కరించేశానని ప్రచారం చేసుకున్నారు తప్ప.. చేసిన పని ఒక్కటీ లేదు. తన మిత్రపక్షం అధికారంలో ఉన్నా కూడా ఏమీ చేయలేకపోయారు.



కిడ్నీ రీసెర్చ్‌సెంటర్ పరిశీలనలో మ్యాప్ చూస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్

- కిడ్నీ వ్యాధి గ్రస్తులకు పింఛన్‌ను రూ.3500 నుంచి రూ.10వేలకు పెంచారు. 5పైబడి సీరం క్రియేటినిన్ ఉన్న వారికి రూ.5వేలు, డయాలసిస్ రోగులకు రూ. 10వేల పింఛను ఇస్తున్నారు.
- ఉపరితల తాగునీరు అందించేందుకు రూ.700 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లో గల 827 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు.
- వ్యాధి మూలాలను తెలుసుకునేందుకు రీసెర్చ్ సెంటర్‌తో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా మంజూరు చేశారు. మార్చిలో వీటిని ప్రారంభించనున్నారు.

వైఎస్ జగన్ సీఎం అయ్యాక..

- టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. 63 మెషీన్లతో 68పడకలపై డయాలసిస్ అందిస్తున్నారు. సోంపేట, కవిటిలో పడకలు పెంచారు. హరిపురంలో పది పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. కొత్తగా గోవిందపురం, అక్కుపల్లి, కంచిలి, బెలగాంలో డయాలసిస్ సెంటర్లు మంజూరయ్యాయి.
- ఇవి కాకుండా ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో 10పడకలు, బారువ సీహెచ్‌సీలో 10పడకలతో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కొత్తగా ప్రతిపాదనలు తయారయ్యాయి. ఇవికాకుండా రెండు కంటైన్డ్ బేస్డ్ సర్వీసెస్ డయాలసిస్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అవి జిల్లాకొచ్చాయి. కవిటి, సోంపేట సీహెచ్‌సీల్లో వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో యూనిట్‌లో ఏడేసి పడకలు ఉంటాయి.
- టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు 20రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు 37రకాల మందులను అందుబాటులో ఉంచారు.
- కిడ్నీ రోగులకు వైద్య పరీక్షల కోసం సెమీ ఆటో ఎనలైజర్స్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్స్, యూరిన్ ఎనలైజర్స్‌ను ఉద్దానం పరిధిలో ఉన్న 29 ల్యాబ్‌లలో అందుబాటులో ఉంచారు. పాతవి పాడైతే ఎప్పటికప్పుడు కొత్తవి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు.
- టీడీపీ హయాంలో జిల్లాలో నెఫ్రాలజీ విభాగమే లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక శ్రీకాకుళం జీజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ప్రతి శనివారం పలాస సీహెచ్‌సీకి వెళ్లి అక్కడి రోగులకు వైద్యం అందిస్తున్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం కిడ్నీ రోగుల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కిడ్నీరీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం పరిశీలించారు. అధికారులతో కలిసి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మూడు బ్లాక్‌లను తిరిగి పరిశీలించారు. వచ్చే మార్చిలో ప్రారంభించనున్నామని చెప్పారు. ఆయనతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బి.గిరిబాబు, పలాస తహసీల్దార్ లంబాల మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాలరావు, ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

బతుకుతా అనుకోలేదు



నా పేరు సుగ్గు లక్ష్మీ. ఇచ్ఛాపురం మండలం మారుమూల ప్రాంతం సన్యాసిపుట్టుగ గ్రామం మాది. నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ లక్షల రూపాయలు ప్రైవేటు ఆస్పత్రికే ధారబోశాను. అప్పట్లో కనీసం ఒక్క డాక్టర్ గానీ, మందులు ఇచ్చేవారు గానీ మా గ్రామానికి వచ్చేవారు కాదు. రెండున్నరేళ్ల నుంచి రూ.10వేలు పింఛన్ వస్తోంది. అంతే కాదు నన్ను డయాలసిస్ కేంద్రానికి తీసుకువెళ్లడానికి 108 బండి వస్తోంది. కలలో కూడా అనుకోలేదు నేను ఇప్పటి వరకు బతుకుతానని, అంతా జగనన్న దయే!

రూ. 10వేలు పింఛన్ అందుకుంటున్నాం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.10వేలు పింఛన్ ఇస్తున్నారు. టీడీపీ హయాంలో డయాలసిస్ చేసుకోవడానికి స్థానికంగా సరిపోయిన బెడ్స్ లేక ఇబ్బంది పడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సమస్యలు నుంచి గట్టెక్కాం. డయాలసిస్ కూడా సకాలంలో చేసుకుంటున్నాం.

– మర్రిపాటి తులసీదాస్, దయాలసిస్ రోగి, పెద్దశ్రీరాంపురం, కంచిలి మండలం

ఆదుకున్న జగనన్న ప్రభుత్వం



పూర్తిగా చితికిపోయిన కిడ్నీ బాధితుల్ని జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆదుకుంది. ఉద్దానం పర్యటన సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిగా మా సమస్యల మీద దృష్టిపెట్టారు. మాకు అన్ని విధాలా సహకరిస్తున్నారు.

– లండ శంకరరావు, కిడ్నీ దయాలసిస్ రోగి, పెద్దశ్రీరాంపురం గ్రామం, కంచిలి మండలం

ఉచితంగా మందులు, ఇంజెక్షన్లు..



డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ రోగులకు అవసరమైన అన్ని మందులను, ఇంజెక్షన్లను ఉచితంగానే ఇస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక విశాఖపట్నం లాంటి దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండానే డయాలసిస్ చేయించుకుంటున్నాం.

– అందాల రత్నాలు, దయాలసిస్ రోగి, లోహరిబంద గ్రామం, మందస మండలం

పవన్‌ది రాజకీయ దిగజారుడుతనం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: టీడీపీ సభల వల్ల ప్రజల ప్రాణాలు పోయినా పట్టించుకోని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అందుకు కారకుడైన చంద్రబాబును పరామర్శించడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి అద్దం పడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఉర్లాం ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడారు. పవన్‌కు రాజకీయ విజ్ఞత శూన్యమని అన్నారు. కుప్పంలో జీఓ నంబర్1 ని పోలీసు యంత్రాంగం అమలు చేయడానికి ప్రయత్నిస్తే చంద్రబాబు దానిపై మీడియా ముందు నటిస్తే, అతని దత్త పుత్రుడు ఓవర్ యాక్షన్ చేయడానికి సిద్ధమైపోయారని ఎద్దేవా చేశారు. కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు అమాయక ప్రజలు చనిపోవడానికి కారణమైన చంద్రబాబు వద్దకు వెళ్లి పరామర్శించడం పవన్ నిజస్వరూపమన్నారు. చంద్రబాబుతో పాటు పవన్‌కు జనం బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలతో దూసుకుపోతున్న వైఎస్ జగన్‌కే జనం మళ్లీ పట్టం కడతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు, సొసైటీ అధ్యక్షుడు ప్రభాకరరావు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, కె.శేఖరరావు, సురంగి నర్సింగరావు, నడిమింటి శాంతారావు, వాకముళ్ల చక్రధర్, మొయ్యి లక్ష్మునాయుడు, సడగాన రవి తదితరులు పాల్గొన్నారు.



ఉర్లాం ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు

● భోగికి పిడకలు



మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు ఆవు పేడతో తయారు చేసిన పిడకలను సోమవారం ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన 50వేల భోగి పిడకలను పెద్ద కుప్పగా పెట్టి గ్రామస్తులకు అవగాహన కల్పించారని పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు.

– సారవకోట

నేడు పలాసలో ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన



కాశీబుగ్గ: ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉద్దానంలోని కిడ్నీ రోగుల స్థితిగతులు, అందుతున్న వైద్య సేవలను ఆమె పరిశీలించనున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం మీదుగా పలాస చేరుకుంటారు. మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి ఉద్దానంలోని గ్రామాల్లో పర్యటిస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మంత్రి ఉదయం పలాస చేరుకున్న తర్వాత పది గంటలకు హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో అపోలోతో సంయుక్తంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని సందర్శిస్తారు. 10.30కు మందస మండలంలోని లోహరిబందలో సర్పంచ్ రాపాక శేషగిరి ఆధ్వర్యంలో కిడ్నీవ్యాధిగ్రస్తుల సమావేశంలో పాల్గొంటారు. 11 గంటలకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ.50 కోట్లతో నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 2.30కు విశాఖ బయల్దేరుతారు.

స్పందనకు 141 అర్జీలు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందనకు వచ్చిన సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులకు సూచించారు. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 141 వినతులు వచ్చాయి. కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఉప కలెక్టర్ జయదేవి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుతా పోర్టల్‌లో జిల్లాకు సంబంధించి 61 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు జీవీ చిట్టిరాజు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డీఎస్‌ఓ వెంకట రమణ, సహాయ సంచాలకులు వ్యవసాయ శాఖ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 30 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: స్పందనకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 30 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ వెల్లడించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

● టైగర్ సవారీ



జిల్లా కేంద్రంలో పులి బొమ్మ వాహనదారులను కాసేపు కంగారు పెట్టింది. ఓ ఎగ్జిబిషన్‌లో పెట్టేందుకు పులి బొమ్మను ఆటో వెనుక కట్టి ఇలా తీసుకెళ్లారు. బొమ్మ కాస్త సజీవంగా కనిపించడంతో చూసిన వారికి కాసేపు కంగారు తప్పలేదు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

క్లుప్తంగా

ఆటో చోరీపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: ఆటో చోరీకి గురైందని ఫిర్యాదు అందిందని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్సై బలివాడ గణేష్ సోమవారం తెలిపారు. మండల వీధి సమీపంలో ఉన్న గైనేటి వీధిలో నివాసముంటున్న సల్లాన కృష్ణారావు తన ఆటోను ఆదివారం మధ్యాహ్నం మెయిన్‌రోడ్డును ఆనుకొని పార్కింగ్ చేశాడు. రాత్రి చూసేసరికి ఆటో కనిపించనట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బంగారం పోయిందని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: బస్సులో ప్రయాణిస్తుండగా నాలుగు తులాల బంగారం, పది వేల రూపాయలతో ఉన్న పర్సు పోయిందని బాధితులు ఫిర్యాదు చేసినట్టు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే .. ఎల్ఎన్‌పేట మండలం శ్యామలాపురం గ్రామానికి చెందిన పిల్లా సీతమ్మ గత నెల 13న విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకు బస్సులో ప్రయాణించారు.. తీరా ఇంటి కొచ్చాక తన బ్యాగు చూసేసరికి అందులో పర్సు మాయమైంది. భర్తకు తెలిస్తే కోప్పడతాడని భావించిన ఆమె విషయం చెప్పలేదు. అయితే ఈ విషయమై సీతమ్మను ఆమె భర్త ఆదివారం గట్టిగా నిలదీయంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో భర్తను తీసుకొని వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

బిల్లుల అప్‌లోడ్‌లో జాప్యం వద్దు

- కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద ఆగస్టు నుంచి డిసెంబర్ నెల వరకు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల అప్‌లోడ్ విషయంలో జాప్యం వద్దని కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ మండల అధికారులకు స్పష్టం చేశారు. గడప గడపకు పనులు, జల జీవన్ మిషన్, స్వచ్ఛ సంకల్పం, ఉపాధిహామీ పథకం అమలు, ప్రాధాన్యత భవనాలు, గృహ నిర్మాణాలు, నాడు–నేడు, స్పందన తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల విద్యాశాఖ అధికారులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, సమగ్ర శిక్షా, గిరిజన సంక్షేమం, నీటిపారుదల శాఖ, మున్సి ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు జీజీఎంపీ కార్యక్రమం కింద మంజూరు చేసిన పనుల్లో 51 పనులకు చెందిన బిల్లులు ఇంతవరకు అప్ లోడ్ కాలేదన్నారు. ఎమ్మెల్యే నుంచి పనులకు ప్రతిపాదనలు అందినప్పటికీ అప్‌లోడ్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ద్వారా బిల్లులు ఎప్పటికపుడు అప్‌లోడ్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈపీడీసీఎల్ ఈఈలు గురువారం నాటికి బిల్లులు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం నుంచి రోజూ బిల్లులు అప్ లోడ్ చేయాలన్నారు. స్వచ్ఛ సంకల్పం కింద చేపట్టిన పనుల్లో పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. 621 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు గాను 513 కేంద్రాలకు చెందిన బిల్లులు మాత్రమే అప్‌లోడ్ అయ్యాయన్నారు. ఇంకా 291 కేంద్రాలు నిర్మించాల్సి ఉందన్నారు. రాగోలు, లావేరు, అవలంగి, నందిగామ, కంచిలి ప్రాంతాల్లో స్థానిక శిక్షణ కేంద్రాలను నిర్మిస్తామన్నారు. ఈవోఆర్డీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రెండు పూటలా పనిదినాలు కల్పిస్తున్న ఏకైక జిల్లా మనదే అయినప్పటికీ లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నామన్నారు. రెండు కోట్ల మందికి పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 1.40 కోట్ల మందికి పనిదినాలు కల్పించినట్టు కలెక్టర్ చెప్పారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు నెలలే గడువు ఉన్నందున ప్రతి నెల 20 లక్షల మందికి పనిదినాలు కల్పించాలన్నారు. కొన్ని మండలాల్లో వేతనదారులకు రూ.226 వేతనం ఉన్నప్పటికీ.. సగటు దినసరి వేతనం 178.46 రూపాయలుగా ఉందని, దాన్ని మరింత పెంచేలా చూడాలన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు..

ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రస్తుతం 16,318 గృహాలు పూర్తవ్వగా.. 16,712 పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆర్‌సీ స్థాయిలో ఉన్న 7,802 ఇళ్ల నిర్మాణాలను ఈ నెలలో పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేదని, గతవారం వరకు చెల్లింపులు పూర్తి చేశామన్నారు. ప్రాధాన్యత భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జల్ జీవన్ మిషన్, నాడు–నేడు పథకం పనుల్లో మరింత చొరవ చూపాలన్నారు. స్పందనపై సమీక్షిస్తూ అర్జీదారులకు సంతృప్తి నిచ్చేలా సమాధానాలు ఉండాలన్నారు. సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్.లక్ష్మీప్రసన్న, భూ రికార్డులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, జిల్లా నీటియాజమాన్య సంస్థ, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎస్.గణపతిరావు, జి.వి.చిట్టిరాజు, పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ జయ రాంకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.వర ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా

- 208 మందికి అవకాశం



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రెంటిస్ మేళా నిర్వహించగా.. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడ్ అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమ, పైడిభీమవరంలోని శ్యాంక్రిగ్ ఫిస్టన్స్, యూనైటెడ్ బ్రేవరీస్, ఆంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసిన అధికారులు వారి ఆసక్తి మేరకు 208 మందిని అప్రెంటిస్ కోసం ఎంపిక చేశారు.

పరిశ్రమ నియమ నిబంధనల మేరకు రూ. ఆరు వేల నుంచి 12,689 రూపాయలను గౌరవ వేతనంగా అప్రెంటిస్ సమయంలో అందజేయనున్నారు. తొలుత ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అప్రెంటిస్ నిబంధనలు తెలియజేశారు. నైపుణ్యం బాగుంటే పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఐటీఐ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి అప్రెంటీస్ చేయాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యం, ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి కృష్ణకేశవ, అప్రెంటిస్ కమిటీ సభ్యులు చిట్టి నాగభూషణం పాల్గొన్నారు.

అర్.ఓ.సి నెం. 102654/2019/ఏ2 తేది: 09.01.2023

శ్రీకాకుళం నగరపాలక సంస్థ - శ్రీకాకుళం

బహిరంగ వేలం ప్రకటన

శ్రీకాకుళం నగర పాలక సంస్థకు చెందిన షాప్ రూములకు వాటికి ఎదురుగా చూపబడిన కాలములకు లీజుకు ఇచ్చు విషయములో నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో కమిషనర్ వారిచే గాని లేదా వారివలన అధికారం పొందబడిన వారిచేతనైననూ తేదీ 24.01.2023న ఉదయం 10.30 గం॥లకు ప్రారంభించబడి టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించబడును. అవసరమైనచో ఆ తరువాత దినముల యందు బహిరంగ వేలము కొనసాగును.

వ నెం	వేలం వేయబడు గుత్తలు	కాలపరిమితి	ధరావత్తు	రిజిస్ట్రేషన్ ఫీజులు	సాల్వెన్సీ సర్టిఫికేట్ మొత్తం	వేలం తేది
1	మార్కెట్ ఫీజు వసూలు చేసుకొనుటకు మరియు పురపాలక సంఘ ఆవరణలోని వీధులలోని అమ్ముబడే వస్తువులపై ఫీజు వసూలు చేసుకొనుట	తేది 01.04.2023 నుండి తేది 31.03.2024 వరకు	రూ.1,00,000/- మిగిలిన ధరావత్తు పాట అనంతరం తక్షణమే చెల్లించవలెను	పాట మొత్తము పై రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు వారి నిబంధనలు ప్రకారం ఫీజు చెల్లించవలెను.	రూ.10,00,000/-	వేలం తేదీ 24.01.2023 ఉదయం 10.30 గంటల నుండి
2	మేకలు, గొర్రెలు, వధశాలలో ఫీజు వసూలు చేసుకొనుటకు	తేది 01.04.2023 నుండి తేది 31.03.2024 వరకు	రూ.10,000/-	పాట మొత్తము పై రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు వారి నిబంధనలు ప్రకారం ఫీజు చెల్లించవలెను.	రూ.50,000/-	

షాపు రూములు

వ నెం	వివరములు	కాలపరిమితి	నెలసరి అద్దె	చెల్లించవలసిన ధరావత్తు	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ	వేలం తేది
3	శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ మార్కెట్ గ్రౌండ్ ఫ్లోర్ నందు గల ఖాళీగా ఉన్న 15 షాప్ రూములకు సి బ్లాక్ మెట్లు గది (G.F) = 01 డి బ్లాక్ - 67 (G.F) = 01 ఇ & ఎఫ్ బ్లాక్ మెట్లు గది (G.F) = 01 ఇ & ఎఫ్ - 82 (G.F) = 01 ఒ.ఎస్.-3,4,5,6,7,8,9,10,11,12,15 (G.F)=15	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	వేలం తేదీ 24.01.2023 ఉదయం 10.30 గంటల నుండి
	శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ మార్కెట్ మొదటి అంతస్తు నందు గల ఖాళీగా ఉన్న 43 షాప్ రూములకు ఎ బ్లాక్ -01 నుంచి 11&13,15,16 = 14 బి బ్లాక్-28, 29&31 = 03 బి/ఎఫ్-22 & 34 =02 సి బ్లాక్- 43, 44 నుంచి 49 = 07 డి బ్లాక్ -51 నుంచి 61&64 నుంచి 68 = 17 మొత్తం = 58 పై షాప్ రూములలో మొదటి అంతస్తు ఎస్.సి (SC) లకు - బి బ్లాక్‌లో షాప్ నెం. 28, సి బ్లాక్‌లో షాప్ నెం. 43, డి బ్లాక్‌లో షాప్ నెం. 61, 66, 67. ఎస్.టి (ST) లకు - ఎ బ్లాక్‌లో షాప్ నెం. 15, 16 & డి బ్లాక్‌లో షాప్ నెం. 67, డి బ్లాక్‌లో షాప్ నెం. 64, 65. నాయిబ్రాహ్మణులు మరియు రజకులకు డి బ్లాక్‌లో షాప్ నెం. 58, 59, 60	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
4	శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ మార్కెట్ నందుగల E&F బ్లాక్ మొదటి అంతస్తుపై గల ఓపెన్ ఏరియా 40.00X28.00 చ.అ -1, 40.00X28.00 చ.అ.-2	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.1,50,000/-	రూ.10,00,000/-	
5	Opp N.T.R. M.H School వద్దగల జనరల్ కేటగిరీకి చెందిన షాప్ నెంబర్లు- 17,21,25,27,28 మొత్తం = 05	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.5,00,000/-	
6	శ్రీ పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద గల మొదటి అంతస్తునందు గల ఖాళీగా ఉన్న షాపు రూములకు షాప్ నెం. 03 నుండి 09 = 07 మరియు 11 నుండి 13 = 03 మొత్తము = 10	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	వేలం తేదీ 24.01.2023 ఉదయం 10.30 గంటల నుండి
7	గాంధీపార్క్ జంక్షన్ షాపింగ్ కాంప్లెక్స్- 01 నుండి 20 వరకు & 22 నుండి 24 వరకు పై షాపు రూములలో ఎస్.సి. (SC) లకు షాపు నెం. 09, 20 & 22. ఎస్.టి. (ST) లకు షాపు నెం. 24, రజక/ నాయీబ్రాహ్మణులకు షాపు నెం. 23 = 23 షాపులు	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	
8	శ్రీ బుక్కవారి బండ వద్దగల షాప్ నెంబర్లు - 04,06 (ఎస్.సి) = 02 షాపులు	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.60,000/-	రూ.5,00,000/-	
9	7 రోడ్ జంక్షన్ భవానీ షాపింగ్ కాంప్లెక్స్- 1 నుండి 9 వరకు పై షాపు రూములలో ఎస్.సి. (SC) లకు షాపు నెం. 06, ఎస్.టి. (ST) లకు షాపు నెం. 08. మొత్తం = 09 షాపులు	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	
10	శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ మార్కెట్ నాగావళి కృష్ణాలైన్ నందు మొదటి అంతస్తు నందు గల ఖాళీగా ఉన్న 19 షాప్ రూములు. పై షాపు రూములలో ఎస్.సి.లకు షాప్ నెం. -13, ఎస్.టి.లకు షాప్ నెం.- 07 మరియు నాయిబ్రాహ్మణులు షాప్ నెం: 12 గలవి	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.1,00,000/-	
11	నామబాల వీధి షాపింగ్ కాంప్లెక్స్. షాపు నెం : 01, 2 & 4, 6 = 4 షాపులు	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.2,00,000/-	
12	Opp: మునిసిపల్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం - 16, స్టాల్ నెం - 9,10,13 =04 షాపులు పైషాపురూములలో ఎస్.సి (SC) లకు స్టాల్ నెం.13, ఎస్.టి.(ST) లకు - షాపునెం -15 & స్టాల్ నెం-09	లీజుకిచ్చిన తేదీ నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.60,000/-	రూ.10,00,000/-	

షరతులు: 1) టెండర్ కం వేలం పాటలో పాల్గొనదలచినవారు వేలం పాట మొదలు పెట్టేముందర డిపాజిట్ చెల్లించి తేదీ 23.01.2023 తారీఖు సాయంత్రం గం॥ 5.00 లోపు పొందిన సాల్వెన్సీ సర్టిఫికేట్‌తో పాటు ఒరిజినల్ ఇ.సి దాఖలు చేసి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. 2) ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms.No.56, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ (J1) తేది 05.02.2011 నకు లోబడి షరతులు వర్తించును. 3) నగర పాలక సంస్థవకు చెందిన ఖాళీగా ఉన్న షాపులు పూర్తి వివరముల కొరకు కార్యాలయ పనిచేయు వేళలో రెవెన్యూ సెక్షన్‌ను సంప్రదించగలరు.

సం/- **సి.ఓబులేసు,** కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

కేసులను సమన్వయంతో ఛేదించాలి



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

- జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: నేర నియంత్రణకు నిఘా కట్టుదిట్టం చేయాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. కేసులను సమన్వయంతో ఛేదించి శ్రీకాకుళాన్ని నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు ఆధ్వర్యంలో నేరాల ఛేదన, నిందితులను పట్టుకోవడం వంటి అంశాలపై సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సిబ్బంది అంకితభావంతో పనిచేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కేసుల ఛేదనపై నైపుణ్యతను పెంచుకుని సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించాలన్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఎప్పటికప్పుడు పాత నేరస్తులపై నిఘా పెడుతూ వారి ఉనికిని కనిపెట్టాలన్నారు. సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా చర్యలు చేపట్టి దేవాలయాల్లో చోరీలు, గొలుసు దొంగతనాలు, ఆస్తి నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి గస్తీ నిర్వహించి అపరిచిత వ్యక్తులు తారసపడితే వారిని ప్రశ్నించడం, పాత నేర చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు పండుగ వేళల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి స్థానిక పోలీసులు ఎల్.హెచ్.ఎం.ఎస్ యాప్ సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనుమానం కలిగిన ప్రతీ అపరిచిత వ్యక్తి తాలుకా ఫింగర్ ప్రింట్లను జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో వివరాలతో సరిపోల్చాలన్నారు. ఇతర జిల్లాల్లో జరిగే నేరాల్లో నేర తరహా విధానాన్ని తెలుసుకొని మన జిల్లాలో వారి ఉనికి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఉన్నతాధికారుల ఆదేశాలను సర్కిల్ పరిధిలో వారు పాటించి నేరాల సంఖ్యను తగ్గించాలని కోరారు. సంక్రాంతి నేపథ్యంలో కోడి పందాలు, పేకాట శిబిరాలు ఏర్పాటు చేయకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సీఐలు జీవీ రమణ, బి.ప్రసాదరావు, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు స్వీటీ ఎంపిక



సాధించిన పతకాలతో ఎం.స్వీటీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఎం.స్వీటీ ఎంపికయ్యారు. ఫిబ్రవరి 19, 20 తేదీల్లో హర్యానాలో జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఈమె ప్రాతినిథ్యం వహించనున్నారు. ఈ నెల 6,7 తేదీల్లో గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వీటీ జావెలిన్‌త్రో, షాట్‌పుట్, డిస్కస్‌త్రో ఈవెంట్స్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. ఎచ్చెర్ల మండల పరిధి కొత్తపేట జెడ్పీహెచ్‌స్కూల్‌లో ఈమె పీడీగా పని చేస్తున్నారు. స్వీటీ ప్రతిభపై డీఈవో గార పగడాలమ్మ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కొత్తపేట స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225

పక్కా ఏర్పాట్లతో రథసప్తమి మహోత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

- ఆహ్వాన పత్రికల ఆవిష్కరణలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

అరసవల్లి: భక్తులకు సంతృప్తికర దర్శనాలు కలిగేలా పక్కాగా ఏర్పాట్లు చేసి రథసప్తమి మహోత్సవాన్ని జరిపించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. సోమవారం ఉదయం స్థానిక క్యాంపు కార్యాలయంలో జిల్లా దేవదాయ శాఖాధికారి డి.వి.వి.ప్రసాదరావు, అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలతో రథసప్తమి ఉత్సవంపై చర్చించారు. ఈనెల 27వ తేదీ అర్ధరాత్రి 12 నుంచి 28వ తేదీ రాత్రి పది గంటల వరకు స్వామి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్ల తీరుపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్న దృష్ట్యా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు.

అనంతరం రథసప్తమి ఆహ్వాన పత్రికలను అధికారులు, అర్చకులతో కలిసి మంత్రి ధర్మాన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి శ్రీనివాసరావు, ఆలయ పాలక మండలి మాజీ సభ్యుడు మండవల్లి రవి, గంగు సీతాపతి, శ్రీకూర్మం ఈవో గురునాథరావు, అరసవల్లి ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్.చక్రవర్తి, సర్వేయర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

జానపద జాతరకు మంత్రి సీదిరికి ఆహ్వానం



మంత్రి అప్పలరాజుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

పలాస: చిన్న నీలావతి గ్రామంలో ఈనెల 11వ తేదీన జరగనున్న సిక్కోలు జానపద కళాజాతరలో పాల్గొనాలని కోరుతూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు నిర్వాహకులు ఆహ్వానం పత్రాన్ని సోమవారం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరంగా.. తప్పకుండా వస్తానని మంత్రి చెప్పారు. ప్రజా గాయకుడు గద్దర్ కూడా కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఆహ్వాన పత్రం అందజేసిన వారిలో కళాజాతర నిర్వహకులు మల్లేన దేవరాజు, రాపాక ధనరాజు, తామాడ ప్రదీప్, మామిడి కృష్ణారావు, మడియా వాసు, దున్న రామారావు ఉన్నారు.

విభజన హామీల సాధనకు
20 నుంచి సమరయాత్ర



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇచ్ఛాపురం: రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం చేసిన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమర యాత్ర చేయనున్నట్లు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు.

స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనలో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రత్యే హోదా సాధించేలా విద్యార్థి సంఘాలు, ప్రజలను చైతన్యం చేయడానికి సమర యాత్ర చేస్తామన్నారు. ఈ యాత్ర జనవరి 20వ తేదీన హిందూపురంలో ప్రారంభించి ఫిబ్రవరి నాలుగో తేదీన ఇచ్ఛాపురంలో ముగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సు నాయుడు, కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ, ఎం.యుగంధర్, వేణుగోపాల్, నారాయణస్వామి పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



కరువులు (ఫైల్)

ఎల్.ఎన్.పేట: కరకవలస గ్రామానికి చెందిన కుప్పిలి కరువులు (56) విష గుళికలు తిని సోమవారం ఆత్మాహత్యకు పాల్పడ్డాడు. కొండపోడు పనులు చేస్తున్న సమయంలో భార్య భర్తల మధ్య మాటల వాదన జరిగింది. మనస్తాపానికి గురైన కరువులు చెద నివారణ కోసం ఉంచుకున్న విషగుళికలు తినేశాడు. భార్యపై కోపంతో అక్కడి నుంచి ఇంటికి నడుకుని వచ్చేశాడు. ఇంటికి వచ్చిన తరువాత అపస్మారక స్థితిలో చేరుకున్న కరువులును స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రికి వెళుతున్న సమయంలో ఈయన మృతి చెందాడని భార్య పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సరుబుజ్జిలి పోలీసులు తెలిపారు.

వంశధార కాలువలో పడి వ్యక్తి మృతి



మార్కండేయ మృతదేహం

టెక్కలి రూరల్: వంశధార కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. పొలవరం గ్రామ సమీపంలోని కాలువలో స్నానాలు చేస్తున్న వారు సోమవారం ఉదయం మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. టెక్కలి ఎస్సై–2 రమేష్‌బాబు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి.. విచారణ చేపట్టగా పాతపట్నం గాయత్రి నగర్‌కు చెందిన పండిట్ మార్కండేయ (59)గా గుర్తించారు. రెండేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఈయన ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వచ్చేశాడు. అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది కాలువలో పడి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నట్టు ఎస్సై రమేష్‌బాబు చెప్పారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామన్నారు. మృతుడికి కుమారుడు శంకర్, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

కళాకారుడు వెంకటేశ్వరరావుకు ఘన స్వాగతం



వెంకటేశ్వరరావుతో ఎంపీపీ దాస్ తదితరులు

సోంపేట: హైదరబాద్‌కు చెందిన ప్రముఖ మృదంగ కళాకారుడు యల్లా వెంకటేశ్వరరావు మంగళవారం సోంపేటలో జరగనున్న సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం బారువ చేరుకున్నారు. ఈయనకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ యర్ర రజనీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సంగీత విభావరి కార్యక్రమంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పాల్గొంటారన్నారు.